# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023






**నేటి నుంచి స్పోర్ట్స్ మీట్**

ములకలపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు. 12లో



**డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ప్రగతి**

తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. 12లో

గరిష్టం / కనిష్టం
$34^{\circ} / 23^{\circ}$

**వాతావరణం**

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి మరింతగా పెరగుతుంది.

## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### డ్రిప్ పరికరాలు అందించండి

కలెక్టర్‌కు కొబ్బరి రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొబ్బరి రైతులు

**అశ్వారావుపేటరూరల్:** కొబ్బరి తోటలు సాగు చేస్తున్న రైతులకు బిందు సేద్యం పరికరాలు ఇవ్వాలని, అంతర పంటలకు రాయితీ పథకాలు వర్తింపజేయాలని కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం నాయకులు కలెక్టర్ ప్రియాంక ఆలను కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. అశ్వారావుపేట, దమ్మపేట కేంద్రంగా కొబ్బరి బోర్డు ప్రాంతీయ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నుంచి పథకాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, సంఘం నాయకులు ఆలపాటి రామ్మోహనరావు, కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరి మహేశ్వర రెడ్డి ఉన్నారు.

### 'కానిస్టేబుల్' అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



ఎస్పీ కార్యాలయంలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

**కొత్తగూడెంటౌన్:** ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎస్పీ కార్యాలయంలో గురువారం పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. సర్టిఫికెట్ల పరిశీలనకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. జిల్లా వ్యాప్తంగా సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులు 64 మంది ఉండగా 58 మంది హాజరయ్యారు. ఏఆర్ విభాగంలో 37 మందికి 35 మంది హాజరయ్యారని ఎస్పీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. కాగా, శుక్రవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగనుంది.

### నియోజవర్గాలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌లు

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** రానున్న ఎన్నికల నేపథ్యాన నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. రాష్ట్రంలోని 54 నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించగా ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు స్థానాలు ఉన్నాయి. మధిర నియోజకవర్గానికి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కొండబాల కోటేశ్వరరావును ఇన్‌చార్జ్‌గా నియమించారు. అలాగే, సత్తుపల్లికి ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, వైరాకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఇల్లెందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేటకు డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, భద్రాచలానికి ఎమ్మెల్సీ తాతా మధును ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం గురువారం ప్రకటన విడుదల చేసింది. ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన వా రు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచార కార్యాచరణ రూపొందించి అమలుచేయాల్సి ఉంటుంది.

# రాజధాని బాటలో..



మంత్రి సత్యవతి, ఎంపీలు వద్దిరాజు, కవితతో కలిసి ప్రగతి భవన్‌కు వెళ్తున్న ఇల్లెందు అసమ్మతి నేతలు

**హైదరాబాద్‌కు క్యూ కడుతున్న పలువురు..**

- బీ ఫామ్ కోసం బీఆర్ఎస్ నేతలు
- టికెట్ ప్రయత్నాల్లో 'హస్తం' నాయకులు
- మంత్రి కేటీఆర్ చెంతకు ఇల్లెందు అసమ్మతి

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే టికెట్లు దక్కించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు, టికెట్లపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టులు అంతా 'చలో హైదరాబాద్' అంటున్నారు. ఇప్పటికే కొందరు రాజధానిలో మకాం వేయగా.. మరికొందరు నేడు, రేపు హైదరాబాద్ బాట పట్టనున్నారు.

**చల్లారని ఇల్లెందు సెగ..**

ఇల్లెందు నియోజవకర్గంలో బీఆర్ఎస్‌లో చెలరేగిన అసమ్మతి ఎంతకీ చల్లారడం లేదు. రెండు వారాల క్రితం మంత్రి హరీశ్‌రావుకు తమ ఇబ్బందులు చెప్పుకున్న అసమ్మతి వర్గం నేతలు గురువారం హైదరాబాద్ వెళ్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవితతో కలిసి ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డీవీ, పార్టీ అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, కృష్ణప్రసాద్, మధుకర్‌రెడ్డి కేటీఆర్‌ను కలిశారు. సుమారు రెండు గంటల పాటు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. అసమ్మతి నేతలు చెప్పిన అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ నుంచి వచ్చే ఏ ఆదేశాలనైనా పాటించేందుకు సిద్ధంగా ఉండాలని వారికి సూచించారు.

**'గులాబీ' అభ్యర్థుల పయనం..**

అధికార భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. గత నెల రోజులుగా వీరంతా నియోజకవర్గాల స్థాయిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు తదితర అధికారిక కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. అయితే ఎన్నికలు సమీపించిన వేళ ఇల్లెందు, అశ్వారావుపేటలో అసమ్మతి చెలరేగడం అభ్యర్థులకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. ఈనెల 15న హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ సమావేశం జరగనుంది. టికెట్లు కేటాయించిన అభ్యర్థులకు ఆ సమావేశంలోనే బీ ఫామ్‌లు ఇస్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఇప్పటికే హైదరాబాద్ చేరుకోగా, రేగాకాంతారావు, హరిప్రియనాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తెల్లం వెంకట్రావు నేడు, రేపు హైదరాబాద్ వెళ్లనున్నారు.

**ఢిల్లీ టు హైదరాబాద్..**

కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు అంశం ఇంకా ఓ కొలిక్కి రాకపోవడంతో ఆ పార్టీకి చెందిన ఆశావహులంతా గత పది రోజులుగా ఢిల్లీ కేంద్రంగా లాబీయింగ్ చేయడంలో బిజీగా ఉన్నారు. నిన్నామొన్నటి వరకు టికెట్ల కేటాయింపు కోసం నియమించిన స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు ఢిల్లీలో జోరుగా సాగాయి. దీంతో ఆశావహులు తమకు సానుకూలంగా ఉన్న అంశాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు అక్కడే మకాం వేశారు. లంబాడా సామాజిక వర్గానికే ఇల్లెందు టికెట్ ఇవ్వాలంటూ ఆజ్మీరా శంకర్‌నాయక్, ప్రవీణ్ నాయక్, రామచంద్రునాయక్ తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఇక కొత్తగూడెం టికెట్ బీసీలకే ఇవ్వాలంటూ 'గూడెం' నేతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**సోమవారం తొలి జాబితా..**

కమలం పార్టీకి సంబంధించి ఇల్లెందు నుంచి ఊకె అబ్బయ్య, భద్రాచలం నుంచి కుంజా సత్యవతి వంటి మాజీ ఎమ్మెల్యేలు ఆయా స్థానాల నుంచి టికెట్ ఆశిస్తున్నారు. కొత్తగూడెం నుంచి పోటీకి రంగాకిరణ్ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పినపాక నుంచి కేంద్ర సర్వీసులకు చెందిన కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపుతారనే ప్రచారం జరుగుతోంది. కాగా బీజేపీ మొదటి జాబితా వచ్చే సోమవారం వెలువడుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆశావహులు తమ వంతు ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు.

**గుర్రుగా ఉన్న పొదెం..**

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో వామపక్షాలకు పొత్తు కుదిరితే భద్రాచలం అసెంబ్లీ స్థానం సీపీఎంకు కేటాయిస్తారనే ప్రచారం విపరీతంగా జరగడంతో కాంగ్రెస్ పార్టీ పెద్దలతో అమీతుమీ తేల్చుకునేందుకు భద్రాచలం సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య రెండు రోజుల క్రితం హైదరాబాద్ చేరుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని పొత్తులో ఇతర పార్టీకి టికెట్ కేటాయించడమేంటని ఆయన పార్టీ పెద్దలను నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ పొత్తుల్లో భద్రాచలం స్థానాన్ని సీపీఎంకు ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురైతే పినపాక నుంచి పోటీ చేయాలని పొదెం వీరయ్యకు కాంగ్రెస్ ఆఫర్ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. అయితే భద్రాచలం నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వకుంటే ములుగు నుంచి పోటీకి సిద్ధమని ఆయన పార్టీ పెద్దలకు కబురు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. భద్రాచలం, ములుగు తప్ప మరో స్థానం నుంచి పోటీ చేసే ప్రసక్తి లేదని పొదెం వీరయ్య కుండబద్దలు కొట్టినట్టు గాంధీభవన్ వర్గాల సమాచారం.

### కేటీఆర్‌తో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ



మంత్రి కేటీఆర్‌తో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యేలు హరిప్రియ, వనమా

**ఇల్లెందు:** మంత్రి కేటీఆర్‌తో ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో గురువారం సమావేశమయ్యారు. ఈ నెలలో జరుగనున్న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన విజయవంతంపై చర్చించగా, కేటీఆర్ వారికి సలహాలు, సూచనలు చేశారు. అంతకు ముందు అసమ్మతి నేతలు మంత్రి కేటీఆర్‌తో గంటన్నర పాటు సమావేశమై నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఆమె భర్త వైఖరి గురించి వివరించారు. అయితే అసమ్మతి ఉందని తెలుసు కానీ, ఈ స్థాయిలో ఉందని ఊహించలేదని కేటీఆర్ వారితో అన్నట్లు తెలిసింది. ఇల్లెందు మున్సిపాల్టీని రాష్ట్ర స్థాయిలో మోడల్‌గా తాను అనేక సభల్లో చెప్పానని, ఇంతటి అభివృద్ధి కలిగిన ఇల్లెందును, మున్సిపాల్టీని ఉపయోగించుకోకపోవడం ఏంటని అన్నారని సమాచారం. 'మీకు అండగా ఉంటానని, అధైర్య పడవద్ద'ని కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిసింది.

# ఎన్నికల నియమావళి పాటించాలి

పార్టీల నేతలకు కలెక్టర్ సూచన



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయా పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు ఓటుహక్కు నమోదుకు అవకాశం ఉందని, అర్హులు నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు 24 గంటలూ పనిచేసేలా 1950 కంట్రోల్ నంబరు ఏర్పాటు చేశామని, సీ విజిల్ యాప్ అందుబాటులో ఉందని తెలిపారు. ఫిర్యాదు చేసే తక్షణమే చర్య తీసుకుంటామని చెప్పారు. పినపాక నియోజకవర్గానికి మణుగూరు తహసీల్దార్ కార్యాలయం, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఆయా తహసీల్దార్ కార్యాలయాలు, భద్రాచలానికి సబ్ కలెక్టరేట్‌ను రిటర్నింగ్ కార్యాలయాలుగా ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, డీటీ రంగాప్రసాద్, ఆయా పార్టీల నాయకులు ఎం. ప్రభాకర్‌రావు, లక్ష్మణ్ అగర్వాల్, షేక్ అన్వర్, వై.శ్రీనివాసరెడ్డి, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

**మీడియా సెంటర్ ప్రారంభం**

ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించేందుకు కలెక్టరేట్‌లోని డీపీఆర్‌ఓ కార్యాలయంలో గురువారం మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. పోటీ చేసే అభ్యర్థుల కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ప్రకటనలు తదితర వాటికి తప్పనిసరిగా మీడియా సెంటర్ ద్వారా ప్రీ సర్టిఫికేషన్ తీసుకోవాలని చెప్పారు. మెటీరియల్ ముద్రణలో ప్రచురణకర్త పేరు, సెల్ నంబర్, ప్రింటింగ్ ప్రెస్ చిరునామాతో మూడు ప్రతులు అందజేయాలని, పరిశీలన తర్వాత అనుమతులు జారీ చేస్తామని అన్నారు. సోషల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌ను పరిశీలించి వ్యయాన్ని లెక్కించి సంబంధిత అభ్యర్థుల ఖర్చుకు జమ చేయనున్నట్లు తెలిపారు. ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలన బృందానికి అందజేయాలన్నారు. ఎన్నికల సంబంధిత ప్రకటనలు, ప్రచారాలపై గట్టి నిఘా పెట్టాలని వ్యయ పరిశీలకులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీపీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంసీఎంసీ సభ్యులు శ్రీనివాసన్, జునుమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**సమగ్ర నివేదికలు అందజేయాలి**

సీజ్ చేసిన నగదు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పోలీస్, ఎక్సైజ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజ్ చేసిన ప్రాపర్టీ వివరాలపై నిత్యం ఈసీకి నివేదికలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సీజ్ చేసిన నగదు విడుదలకు డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ట్రెజరీ అధికారి దుర్గాంబతో కలిపి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారుల తనిఖీలో సీజ్ చేసిన నగదు కోసం జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు(9100115679)ను తగు ఆధారాలతో సంప్రదించాలని అన్నారు. కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య, జెడ్పీ సీఈఓ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

**మణుగూరు రూరల్ :** ఎన్నికల విధులను రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా నిర్వర్తించాలని పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థుల ప్రకటనలు, ప్రచారాలపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నిఘా పెట్టాలన్నారు. అనంతరం నోడల్ అధికారి, మణుగూరు డీఎస్పీ ఎస్.వి. రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గం ఏపీ రాష్ట్ర సరిహద్దున ఉన్నందున అక్రమంగా నగదు, మద్యం రవాణా అయ్యే అవకాశాలు ఉన్నాయని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండకూడదని, ఒకవేళ ఉంటే ఆధారాలు చూపించాలని, లేదంటే సీజ్ చేస్తామని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

# పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**పాల్వంచరూరల్ :** మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, అర్చన సమర్పించారు. కాగా, అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనదల్చిన భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9866923261 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

**ప్రచారరథం ప్రారంభం..**

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రచార రథాన్ని కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం గురువారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, గంధం వెంగళరావు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, బండి చిన్న వెంకటేశ్వర్లు, కాటారపు లక్ష్మీనారాయణ, సువాలి, విజయ్‌కుమార్, వెంకటరామారావు పాల్గొన్నారు.

### పాల పంపిణీకి డిస్ట్రిబ్యూటర్లు

**ఖమ్మంవ్యవసాయం:** పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ)లో ద్వారా పాల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. నెల క్రితం ఖమ్మంలో డిస్ట్రిబ్యూటర్ పక్కకు తప్పుకోవడంతో పాల సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు డిస్ట్రిబ్యూటర్ల ఎంపికకు శ్రీకారం చుట్టగా నలుగురు ముందుకు రావడంతో అగ్రిమెంట్ చేశారు. కాగా, డిస్ట్రిబ్యూటర్లకు కేంద్రం వద్ద లీటర్ పాలను రూ.51కి ఇస్తుండగా, వారు రూ.58కి విక్రయించుకునే అవకాశం కల్పించారు.

# హ్యాట్రిక్ సీఎం కేసీఆరే..

- భద్రాచలంలో వెంకట్రావును గెలిపించండి
- ఎమ్మెల్సీ తాతా మధు పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన తెల్లం వెంకట్రావు

**దుమ్ముగూడెం :** నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో విజయదుందుభి మోగించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేస్తారని ఎమ్మెల్సీ తాతా మధు ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన గంగోలులో విలేకరులతో మాట్లాడారు. భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఎంతో కాలంగా ప్రజాసేవలో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని కోరారు. గతంలో గెలిచిన అభ్యర్థులతో ఈ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, బీఆర్ఎస్‌కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని అన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచారని, కానీ అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఒక్క తెలంగాణలోనే ఉంటాయా.. పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఉండవా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కర్నాటకలో 24 గంటల విద్యుత్‌కు బదులు 6 గంటలే ఇస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలతో హామీలు ఇస్తోందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, నాయకులు సాగి శ్రీనివాసరాజు, మట్టా వెంకటేశ్వరరావు, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

# పండుగకు 'ప్రత్యేకం'

- దసరాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు
- నేటి నుంచి సర్వీసులు షురూ
- జిల్లా నుంచి వివిధ రూట్లకు ప్రయాణం సుగమం
- ప్రయాణికులకు నగదు బహుమతులు




కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ..

**చుంచుపల్లి:** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. జిల్లా నుంచి వెళ్లి హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ రెండు పండుగలకు కుటుంబ సమేతంగా సొంతూళ్లకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ శుక్రవారం నుంచి ఈనెల 23 వరకు స్పెషల్ బస్సులు నడపేలా ప్రణాళిక రూపొందించింది. పాఠశాలలకు కూడా నేటి నుంచే దసరా సెలవులు ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ మరింతగా ఉండే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. డివిజన్‌లోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు 304 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. వీటిలో హైదరాబాద్ రూట్‌కు అత్యధికంగా 150 సర్వీసులు తిరుగుతాయి. ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్సులు పెంచేందుకు వీలుగా ఆయా డిపోల్లో అధికారులు ప్రణాళికలు చేశారు. జిల్లా నుంచి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం కూడా బస్సులు నడపనున్నారు. వీటితో పాటు జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు వంటి ప్రాంతాలకు సైతం ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. దసరా సందర్భంగా ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో ఈసారి కూడా అదనపు చార్జీలు వసూలు చేయొద్దని నిర్ణయించారు. అంతేకాక, పండుగ ప్రయాణికులకు ఆకట్టుకునేలా నగదు బహుమతులు అందజేస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఈనెల 21 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారిలో 10 మందిని లక్కీ డ్రా విధానంలో ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున నగదు అందజేస్తారు.

**304 ప్రత్యేక బస్సులు..**

ప్రతి బతుకమ్మ, దసరా పండుగల సీజన్ ఆర్టీసీకి అదనపు ఆదాయపరంగా భారీగా కలిసివస్తోంది. ఈ సారి కూడా దసరా పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు 3 డిపోల పరిధిలో 304 ప్రత్యేక బస్సులను పలు ప్రాంతాలకు నడపాలని నిర్ణయించారు. ఈనెల 23 వరకు ఈ సర్వీసులు వివిధ ప్రాంతాలకు నడుస్తాయి. ఇందులో అత్యధికంగా భద్రాచలం డిపో నుంచి 141 బస్సులు, మణుగూరు డిపో నుంచి 83, కొత్తగూడెం నుంచి 80 బస్సులు నడపనున్నారు. పండుగ తర్వాత కూడా తిరుగు ప్రయాణంలో తగిన సంఖ్యలో బస్సులను ఇతర ప్రాంతాలకు నడిపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. గతేడాది దసరా సందర్భంగా మూడు డిపోల పరిధిలో 200 పైగా బస్సులు నడపగా రూ.60 లక్షల వరకు ఆదాయం సమకూరింది. ఈసారి కూడా అదే ప్రణాళికతో ఆదాయం రాబట్టాలని ఆర్టీసీ అధికారులు సన్నహాలు చేస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



ప్రయాణికుల సౌకర్యార్థం దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ పండుగలకు హైదరాబాద్ నుంచి జిల్లాకు ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు రానున్నారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు శుక్రవారం నుంచి వివిధ ప్రాంతాలకు తిరుగుతాయి. దసరా పండుగ ప్రయాణికులకు ఈసారి ఆర్టీసీలో నగదు బహుమతులు ప్రవేశ పెట్టాం. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం డీఎం

## క్లుప్తంగా

### 20న జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్..

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల క్రీడామైదానంలో ఈ నెల 20న జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, -16, -18 విభాగాల్లో బాలబాలికలకు 100, 400, 800, 1,500, 5000 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలను ఈ నెల 25న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 20న ఉదయం 8 గంటలకు అథ్లెటిక్స్ కోచ్ పి.నాగేందర్ 99636 59598 నంబరులో సంప్రదించాలని కోరారు.

### హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవికి ఎస్పీ నివాళి



శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవికి ఎస్పీ డాక్టర్ వినీత్, ఇతర పోలీస్ అధికారులు నివాళులర్పించారు. గురువారం శ్రీదేవి సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ శ్రీదేవి మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్, మురళి, ఎస్సైలు శ్రీనివాస్, విజయ, హెడ్ కానిస్టేబుల్ ఘని, వీరన్న, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ మధుపై చర్యలు తీసుకోవాలి

చర్ల రూరల్: అధికారులను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ తాతా మధును అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏవీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పాండ్రు హేమ సుందర్ డిమాండ్ చేశారు. గురువారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి హోదాలో ఉండి మన పార్టీ జెండా మోసినోళ్లకే, మన కండువా కప్పుకున్నోళ్లకే ప్రభుత్వ పథకాలు అని బహిరంగంగా మాట్లాడిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. సోంది మల్లుదొర, దబ్బా అనిల్, గట్టుపల్లి రాజు, కురసం వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### కలివేరు క్యాంపులోకి కొండచిలువ



కొండచిలువ

చర్ల రూరల్: సుమారు పది అడుగుల కొండచిలువ గురువారం చర్ల మండలంలోని కలివేరు 151 బెటాలియన్ క్యాంపులోకి ప్రవేశించింది. బెటాలియన్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు కొండచిలువను పట్టుకుని అటవీప్రాంతంలో వదిలారు. ఫారెస్ట్ డీఆర్‌ఓ హచ్యానాయక్, ఎఫ్‌బీఓ శ్రీరాములు పాల్గొన్నారు.

### బస్సు డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


సుజాతనగర్: ఓ బస్సు డ్రైవర్‌కు తల వికారంగా అనిపించడంతో పరిస్థితిని గుర్తించిన అతను బస్సును తక్షణమే నిలిపివేయడంతో ప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ వెళుతోంది. బస్సు సుజాతనగర్ వద్దకు రాగానే డ్రైవర్ దుగ్గిరాల లాజర్‌కు తల వికారంగా, చేయి ఓ పక్కకు లాగుతున్నట్లుగా అనిపించింది. దీంతో ఆలస్యం చేయకుండా సుజాతనగర్‌లో బస్సు నిలిపి స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లగా, ఖమ్మం ఆస్పత్రికి వెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించాడు. బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానానికి తరలించగా, ఏపీజీవీబీ బ్యాంకు సిబ్బంది విజయ్, పుల్లారావుల సాయంతో బస్సు డ్రైవర్‌ను కారులో ఖమ్మం తరలించారు.

### ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీస్

దుమ్ముగూడెం : మండలంలోని సుబ్బారావుపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులకు గైర్హాజరైన ఇద్దరు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఏవీ రామారావు గురువారం షోకాజ్ నోటీసులు చేశారు. హెచ్‌ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయుడు మోహన్‌రావు బుధవారం అనుమతి లేకుండా పాఠశాలకు డుమ్మా కొట్టారు. దీంతో విద్యార్థులు ఆటలు ఆడుకుని ఇంటికి తిరిగి వెళ్లారు. దీంతో రామారావు గురువారం పాఠశాలను సందర్శించి ఇద్దరు ఉపాధ్యాయుల వివరణ తీసుకుని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విషయం డీఈఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం తెలిపారు.

# ‘గుడ్డు’తో ఎంతో ఆరోగ్యం

- ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఆహారంలో భాగం
- నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం



గుడ్లు

ఇల్లెందురూరల్: విటమిన్లు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే గుడ్డు పోషకాహారంగా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. సాధారణంగా వారంలో కనీసం రెండు రోజులైనా ప్రతి ఇంట్లో గుడ్డు తింటుంటారు. 1996లో వియన్నాలో జరిగిన ఇంటర్నేషనల్ ఎగ్ న్యూట్రిషన్ కన్సార్టియంలో ఏటా అక్టోబర్ రెండో శుక్రవారాన్ని ‘వరల్డ్ ఎగ్ డే’గా జరుపుకోవాలని నిర్ణయించారు. గుడ్డు తినడం వల్లే కలిగే ప్రయోజనాలపై కథనం.

**పౌష్టికాహారం**

చిన్నపిల్లలు మొదలుకొని గర్భిణుల వరకు పోషకాహారం అందించేంది గుడ్డు మాత్రమే. సంపూర్ణ మాంసకృత్తులు ఉన్న ఆహారం కావడంతో ప్రభుత్వం అంగన్‌వాడీ పాఠశాలల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పంపిణీ చేస్తోంది. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో వారానికి రెండు లేదా మూడు సార్లు గుడ్డు అందించాలని నిబంధన విధించింది. ఉడికించిన గుడ్డును తీసుకోవడం ద్వారా ఎక్కువ పోషకాలు అందుతాయి.

**నాణ్యమైన గుడ్డు ఇలా..**

గుడ్డును కొనుగోలు చేసే సమయంలో అటూ, ఇటూ ఊపాలి. లోపల సొన కదులుతుంటే గుడ్డు చెడిపోయినట్లు గ్రహించాలి. గుడ్డు నీళ్లలో వేసినప్పుడు మునిగితే మంచిదని, పైకి తేలితే చెడిపోయినట్లు భావించాలి. గుడ్డుపై క్యూటికల్ పొర ఉంటుంది. ఫ్రిజ్‌లో గుడ్లను భద్రపరిచే సమయంలో వాటిని కడిగి పెట్టడం వల్ల క్యూటికల్ పొర దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పొర లేకుంటే బ్యాక్టీరియా గుడ్డులోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. మచ్చలు లేని తెల్లటి గుడ్డునే కొనుగోలు చేయాలి. గుడ్లపై కోళ్లకు సంబంధించిన వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి.

**ఎన్నో ప్రయోజనాలు**

పదకొండు రకాల ఆమ్లాలు ఒక్క గుడ్డులోనే లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్లు, విటమిన్ ఏ, డీ, ఈ, బీ కాంప్లెక్స్ విటమిన్లు, కాల్షియం, ఫాస్పరస్, జింక్ వంటి పోషక పదార్థాలు ఉంటాయి. గుడ్డులో ఉండే విటమిన్ ఏ మనిషి సాధారణ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. విటమిన్ డీ మినరల్స్‌ను గ్రహించి ఎముకల ఆరోగ్యానికి, ధృడత్వానికి ఉపకరిస్తుంది. విటమిన్ ఈ కొన్ని రకాల కేన్సర్, గుండె జబ్బుల నుంచి కాపాడుతుంది. అయోడిన్, ఫాస్పరస్ థైరాయిడ్ హార్మోన్ల సక్రమ నిర్వహణకు, పళ్లు, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతాయి. హృద్రోగులు, స్థూలకాయులు, మధుమేహ బాధితులు గుడ్డులోపల ఉన్న పచ్చసొన తీసి తెల్లసొనను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**మేలైన ఆహారం**



పౌష్టికాహారంగా ప్రతి ఒక్కరూ గుడ్డుకే ప్రాధాన్యమిస్తారు. అందుకే పిల్లలు, గర్భిణులు, బాలింతలు రోజూ ఆహారంలో గుడ్డు తీసుకోవాలని సూచిస్తుంటాం. గుడ్డులోని కొవ్వు పదార్థానికి త్వరగా జీర్ణమయ్యే గుణం ఉంటుంది.

– డాక్టర్ కవిత, వైద్యాధికారిణి, రొంపేడు పీహెచ్‌సీ

**పోషకాలు అధికం**



విటమిన్ సీ తప్ప అన్ని రకాల విటమిన్లు, మినరల్స్, హై క్వాలిటీ ప్రోటీన్లు, మేలు చేసే కొవ్వు పదార్థాలు గడ్డులో ఉంటాయి. పప్పు ధాన్యలతో కలిపి వండుకుని తింటే మరింత బలం చేకూరుతుంది.

– డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

# వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

- అధికారంలోకి రాగానే జిల్లాగా సత్తుపల్లి
- ‘కొండూరు’ పాదయాత్ర ముగింపు సభలో శ్రీనివాసరెడ్డి



సత్తుపల్లిలో మాట్లాడుతున్న పొంగులేటి



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

సత్తుపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని బీఆర్‌ఎస్ నేతలకు ముందే తెలియడంతో దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు ప్రవేశపెట్టినా.. అర్హులెవరికీ పథకం వర్తింపచేయకుండా మాటలతో మభ్యపెట్టారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఏదిఏమైనా యాభై రోజుల్లో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ 145 కి.మీ. మేర చేపట్టిన పాదయాత్ర గురువారం రాత్రి సత్తుపల్లిలో ముగిసింది. ఈసందర్భంగా సుధాకర్, నాయకులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న పొంగులేటి ఆతర్వాత జరిగిన సభలో మాట్లాడారు. ఐదేళ్లలో పథకాలు ప్రవేశపెట్టకుండా ఎన్నికల హడావుడిగా ప్రారంభించారని ఎద్దేవా చేశారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో అమలు నిలిచిపోయి, ఏ ఒక్కరిది లబ్ధి జరగలేదని తెలిపారు. కాగా, వచ్చే ఎన్నికల్లో సత్తుపల్లితో పాటు రాష్ట్రంలోనే కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని శ్రీనివాసరెడ్డి చెప్పారు. తాము ప్రకటించిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని వెల్లడించారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిన సత్తుపల్లి జిల్లా ఏర్పాటు కలను తాము నెరవేరుస్తామని పొంగులేటి చెప్పారు. అలాగే, ప్రతీ మండలానికి 50 పడకల ఆస్పత్రి ఏర్పాటుచేయడమే కాక స్థానికులకే సింగరేణిలో ఉద్యోగాలు ఇచ్చి, బాంబు పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మిస్తామని వెల్లడించారు.

**ఎమ్మెల్సీ తాతా మధు అహంకారం**

అధికార అహంకారంతో ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు చేస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. బీఆర్‌ఎస్ వారికే పథకాలు ఆయన చెప్పడం పేదలపై వారికి ఉన్న శ్రద్ధను తెలియచేస్తోందని పేర్కొన్నారు. యాదవులతో రూ.43వేలు డీడీ కట్టించుకుని ఏళ్లు గడుస్తున్నా గొర్రెలు ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. అనంతరం కొండూరి సుధాకర్ మాట్లాడుతూ తన పాదయాత్రను ప్రజలు అడుగడుగునా స్వాగతించగా వారి కష్టాలు తెలుసుకున్నానని చెప్పారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, డీసీసీబీ డైరెక్టర్ తుమ్మూరి బ్రహ్మయ్య, మందపాటి ముత్తారెడ్డి, మల్లిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ఎస్.కే.మౌలాలీ, దూదిపాల రాంబాబు, కొత్తూరు కోటేశ్వరరావు, మందపాటి పద్మజ్యోతిరెడ్డి, తోట గణేష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్‌కుమార్

చర్ల రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం కొయ్యూరు పీహెచ్‌సీలో ఆర్‌ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వచ్చే వ్యాధులు, జ్వరాల పట్ల ఆర్‌ఎంపీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వచ్చే జ్వరాలన్నీ డెంగీ అని చెప్పి ప్రజలను భయాందోళనకు గురిచేయొద్దని అన్నారు. వైరల్ జ్వరాలకు ఎక్కువ డోస్ యాంటి బయాటిక్ మందులు వాడి, బాధితుల రోగనిరోధక శక్తి తగ్గేలా చేయకూడదన్నారు. సమావేశంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దివ్య నయన, సీహెచ్ సత్యనారాయణ, ఎ.ముత్యాలరావు, కృష్ణయ్య, హనుమంతు, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

**మరో రెండు హాస్పిటళ్లకు నోటీసులు**



నోటీసులు ఇస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తున్న క్లినిక్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. అర్హతలేకుండా వైద్యం చేస్తున్న కారుకొండకు చెందిన ఇద్దరు ఆర్‌ఎంపీలకు నోటీసులు ఇచ్చారు. అర్హత లేకపోయినా బెడ్‌లు వేసి చికిత్స చేస్తున్న కొత్తగూడెం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేశారు. అధికారులు ఫైజ్‌మోహిద్దీన్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ఆర్టీసీ నిర్వహణలోకి పెట్రోల్ బంక్..



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

చుంచుపల్లి: కొత్తగూడెంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను గురువారం డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వాస్తవానికి ఈ నూతన పెట్రోల్ బంక్‌ను గత మార్చిలో ప్రారంభించి నిర్వహణను ప్రైవేట్ డీలర్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు బంక్‌ను ఆర్టీసీ పరిధిలోకి తీసుకొచ్చి, మరోసారి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అధిక సాంద్రత విధానంపై వర్క్‌షాప్



సదస్సులో మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

వైరా: పత్తి పంటను అధిక సాంద్రత విధానంలో సాగు చేసే అంశంపై వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం క్షేత్ర దినోత్సవం, వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సులో అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ పాల్గొని పత్తి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధిక సాంద్రత విధానంలో సాగు చేయడం వల్ల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఆతర్వాత వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.వీరన్న మాట్లాడగా డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ ఎస్.ఓంప్రకాశ్, కె.నాగస్వాతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షిస్తేనే మెరుగైన ఫలితాలు

జలవనరుల శాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు



పాలేరు రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేందర్‌రావు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: ఎండిపోయే దశలో ఉన్న పంటలను కాపాడేందుకు విడుదల చేసిన సాగర్ నీరు వృథా కాకుండా పర్యవేక్షిస్తేనే ఫలితముంటుందని జలవనరులశాఖ ఈఎన్‌సీ(ఓఅండ్‌ఎం) నాగేందర్‌రావు పేర్కొన్నారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి దిగువకు సాగు అవసరాల కోసం నీరు విడుదల చేయగా, ఆయన పాలేరుతో పాటు తనికెళ్ల వద్ద బోనకల్లు బ్రాంచ్, ఏన్కూరు వద్ద సిరిపురం మేజర్, కల్లూరు వద్ద కప్పలబంధం, ఏపీ సరిహద్దు కుంచిపర్తి వద్ద కాల్వలను గురువారం పరిశీలించారు. వారం పాటు నీరు విడుదల చేస్తున్నందున వృథా కాకుండా రైతులు సాగుకు ఉపయోగించుకునేలా పర్యవేక్షించాలని ఇంజనీర్లకు సూచించారు. కాగా, పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం సూచిక వద్దే కాక కాల్వల వద్ద మొక్కలు పెరిగి ఉండటాన్ని గమనించిన ఈఎన్‌సీ సిబ్బందిని మందలించారు. జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, ఎస్ఈలు ఆనందకుమార్, నర్సింగరావు, ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, బాబురావుతోపాటు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# రూ.9.24 లక్షలు సీజ్



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం ఒక్కరోజే రూ.9.24 లక్షలు సీజ్ చేశారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు సూపర్‌బజార్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ బైక్‌పై ఆధారాలు లేకుండా తరలిసున్న రూ.1.68 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. మరో ద్విచక్రవాహనదారుడి నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

**అశ్వారావుపేటలో రూ.2.19 లక్షలు**

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సమీపంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీస్ చెక్ పోస్టు వద్ద గురువారం పోలీసులు నగదు పట్టుకున్నారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఏపీలోని విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు పెనుమత్స శ్రీనివాస రాజు అనే వ్యక్తి కారులో రూ.2,19,600 తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో పట్టుకున్నారు.

**దమ్మపేటలో రూ.2.60 లక్షలు..**

దమ్మపేట: మండలంలోని అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు శుక్రవారం రూ.2.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన రెండు కార్లలో ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

**భద్రాచలంలో రూ.77 వేలు..**

భద్రాచలంఅర్బన్: ఓ వ్యాపారి ఎటువంటి ఆధారాలు లేకుండా రూ. 77 వేలు తీసుకెళ్తుండగా పట్టణంలోని కూనవరం రోడ్‌లో పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# నాటు తుపాకుల విక్రయదారుడి అరెస్ట్

జూలూరుపాడు: నాటు తపాకుల విక్రయదారుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సురారంలో రెండు తుపాకులతో అటవీ ప్రాంతంలోకి వెళ్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఆ తుపాకులు విక్రయించిన, చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన భూక్యా హరిని గురువారం అరెస్ట్ చేశారు. అతని నుంచి మరో తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. కొన్నేళ్ల క్రితం విజయవాడకు చెందిన గుర్తుతెలియని వ్యక్తుల వద్ద భూక్యా హరి నాలుగు నాటు తుపాకులు కొనుగోలు చేశాడు. మూడు నెలల క్రితం మండలంలోని భోజ్యాతండా(పుల్లుడుతండా)కు చెందిన శంకర్ అనే వ్యక్తికి ఒక తుపాకీని రూ.4 వేలకు విక్రయించాడు. అతడు తుపాకీతో తన భార్య శాంతిని కాల్చాడు. ఈ ఘటనకు పాల్పడిన శంకర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా భూక్యా హరి వద్ద నాటు తుపాకీ కొనుగోలు చేసినట్లు తేలింది. అప్పటి నుంచి హరి పరారీలో ఉన్నాడు. బుధవారం పట్టుబడ్డ నిందితులు కూడా అతని వద్దే తుపాకులు కొన్నట్లు తేలింది. దీంతో ముమ్మరంగా గాలింపు చేపట్టిన పోలీసులు హరిని అరెస్ట్ చేశారు. కాగా నిందితుడు గతంలో అక్రమంగా ఆయుధాలు కల్గి ఉన్న కేసులో జైలు జీవితం కూడా గడిపాడు. అనంతరం సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సభలు, సమావేశాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలని తెలిపారు. వినోభానగర్‌లో చెక్ పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఎస్ఐ బి.పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన



లక్ష్మి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండల గన్నవరం గ్రామానికి చెందిన లక్ష్మి (28) గురువారం మృతి చెందింది. ఈ నెల 10న గొంతు వద్ద థైరాయిడ్‌కు సంబంధించిన ఆపరేషన్ చేసి గడ్డను తొలగించేందుకు ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు అదే రోజు ఆపరేషన్ చేశారు. అనంతరం ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తుండగా, గురువారం ఉదయం ఆరోగ్యం విషమించి లక్ష్మి మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట కొంతసేపు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి నిర్వాహకులతో గొడవకు దిగారు.

### ఐఈడీ పేలి ముగ్గురు జవాన్లకు గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా పాలంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అతుల్వర అటవీ ప్రాంతంలో గురువారం ఐఈడీ పేలి ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. అటవీప్రాంతంలో సుమారు 4 కిలోల బరువైన ఐఈడీని గుర్తించి డిఫ్యూజ్ చేస్తుండగా పేలింది. దీంతో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుళ్లు మల్కిత్‌సింగ్, దినేష్‌సింగ్, సుక్మా పోలీస్ తులారామ్ బాఘేల్ గాయపడ్డారు. క్షతగాత్రులను దోర్నపాల్ పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేశారు. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను మెరుగైన వైద్యం కోసం చాపర్‌లో జగదల్పూర్ తరలించారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామం వద్ద కిన్నెరసాని నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమానిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### నకిలీ పత్రాలతో ప్లాట్ అమ్మకానికి యత్నం

**నిందితులపై కేసు నమోదు**

రఘునాథపాలెం: ఇతరుల పేరిట ఉన్న ప్లాట్ పత్రాలపై ఫొటో, పేర్లు మార్చి అమ్మకానికి యత్నించిన ఇద్దరు రూ.10లక్షల మేర టోకరా పెట్టారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు చేసిన ఫిర్యాదుతో రఘునాథపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీని కిసంబంధించి వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెంకు చెందిన తేనే నాగేశ్వరరావు పెట్రోల్ బంక్ నిర్వహిస్తుండగా, బాసిత్‌నగర్ బంజరకు చెందిన రమేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన తనకు లారీ ఉందని చెప్పి డీజిల్ కొట్టించుకునేందుకు వచ్చేవాడు. ఈక్రమంలోనే తనకు రఘునాథపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో 253.33 చదరపు గజాల స్థలం ఉందని చెప్పగా, కొనేందుకు నాగేశ్వరరావు ఆసక్తి కనబరిచాడు. ఈమేరకు రమేష్, ఆయన పద్మ 2020 అక్టోబర్ 23న రూ.10 లక్షలు తీసుకుని అగ్రిమెంట్ చేశారు. రెండు నెలల తర్వాత మిగతా కూడా చెల్లించి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా పద్మ ఫొటో తేడాగా కనిపించింది. దీంతో నాగేశ్వరరావు నిలదీయడంతో తమ అసలు పేర్లు రమేష్, పద్మ కాదని.. భాషా, సుమతి(ప్రభుత్వ ఉద్యోగి) అని ఒప్పుకుని తమ బంధువుల ప్లాట్ డాక్యుమెంట్లతో డబ్బు తీసుకున్నామంటూ చెక్కులు ఇచ్చారు. అయితే, ఆ చెక్కులు జమ చేస్తే అకౌంట్‌లో నగదు లేకపోగా అప్పటి నుంచి ఇద్దరు కానరాకుండా పోయారు. ఈమేరకు నాగేశ్వరరావు చేసిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

### నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో పోలీసులు గురువారం 16 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా తరలిస్తున్న పాత జిన్నెలగూడేనికి చెందిన మడకం రామయ్యను స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐలు గణేష్, కేశవరావు తెలిపారు.

### రేషన్ బియ్యం సీజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 2.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం సివిల్ సప్లయ్ డీటీ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని, ఆటోను సీజ్ చేసి రేషన్ బియ్యాన్ని స్థానిక రేషన్ షాపునకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## క్లుప్తంగా...

### ఏపీలో టెక్ మహీంద్రా స్టార్ హోటల్స్

- విశాఖ సహా 3 ప్రాంతాల్లో ఏర్పాటు
- ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మాణం
- సీఎం జగన్‌ను కలిసిన టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నాని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం సహా మూడు ప్రాంతాల్లో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మించేందుకు మహీంద్రా హాలిడేస్ చైర్మన్, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టార్ హోటల్స్ ఏర్పాటు గురించి సీఎం జగన్‌కు ఆయన వివరించారు. ఒక్కో హోటల్ నిర్మాణానికి రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగం అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాల గురించి సీఎం జగన్ వివరించారు. విశాఖ సహా 3 పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టనున్నామని.. వచ్చే 2 నెలల్లో శంకుస్థాపన చేపడతామని మహీంద్రా ప్రతినిధులు వెల్లడించారు.

### చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను 17కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది.

# ఇలాగైతే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. బదిలీకి తోడుగా శాసనసభ ఎన్నికల విధుల్లో వారి సేవలను వినియోగించరాదని ఈసీ ఆదేశించడం పట్ల మరికొందరు తీవ్రంగా నొచ్చుకున్నారు. ఈసీ విధించే ఇలాంటి ఆంక్షలు కెరీర్‌లో రిమార్కుగా ఉండిపోనుండడమే ఇందుకు కారణం.

**బదిలీకి ఇతర కారణాలు సైతం..**

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పర్యటనకు మూడు రోజుల ముందే వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను ఆ శాఖ పనితీరుకు ఎలా బాధ్యురాలిని ? అని బదిలీకి గురైన టీకే శ్రీదేవి 'ఎక్స్'( పూర్వం ట్వీటర్) వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉంటూనే వాణిజ్య శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగడం పట్ల మాత్రమే ఈసీ అభ్యంతరం తెలిపినట్టు తెలిసింది. బదిలీ చేసిన 20 మంది అధికారుల్లో 18 మందిని శాసనసభ ఎన్నికల విధుల్లో ఉపయోగించరాదని ఈసీ ఆదేశించగా, ఆమెతో పాటు బదిలీకి గురైన అబ్కారీ శాఖ డైరెక్టర్ ముష్రఫ్ ఫారూఖీకి ఈ విషయంలో అలాంటి ఆంక్షలు విధించలేదు. ఎన్నికల నిర్వహణలో వాణిజ్య పన్నుల శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉండగా, ఆ శాఖ కమిషనర్‌గా పూర్తి స్థాయి అధికారిని నియమించాలని ఈసీ ఆదేశించినట్టు తెలిసింది. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి సీఎస్ శాంతికుమారిని తప్పించిన ఈసీ, ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఆ శాఖలకు సైతం పూర్తి స్థాయి అధికారులను కార్యదర్శులుగా నియమించాలని కోరింది.

**ఈసీకి చేరిన కొత్త పేర్లు ..**

ఎక్సైజ్, అబ్కారీ శాఖలకు కొత్త ముఖ్యకార్యదర్శులతో పాటు బదిలీకి గురైన ఇతర 20 మంది అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈసీ ఆదేశాల మేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లను ప్రతిపాదిస్తూ గురువారం సాయంత్రం 5గంటల్లోగా ఈసీకి నివేదిక సమర్పించింది. ఆయా అధికారుల వార్షిక




పనితీరు నివేదిక(ఏపీఏఆర్)లు, విజిలెన్స్ క్లియరెన్స్‌లను సైతం పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను పరిశీలించి ఆయా పోస్టుల్లో ఎవరిని నియమించాలో ఈసీ నిర్ణయం తీసుకోనుంది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ పోస్టుకు సీనియారిటీ ప్రకారం డీజీ జితేందర్, అదనపు డీజీలు కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సందీప్ సాండిల్యా పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక మిగిలిన రెండు పోలీసు కమిషనరేట్లకు చెరో ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లతో పాటు బదిలీకి గురైన 10 జిల్లాల ఎస్పీల స్థానంలో 30 మంది ఐపీఎస్ అధికారులు, నాన్‌కేడర్ ఎస్పీల పేర్లను ప్రతిపాదించినట్టు సమాచారం. శని, ఆదివారాల్లో వరుస సెలవులు రావడంతో సోమవారంలోగా ఈసీ నుంచి నిర్ణయం వచ్చే అవకాశాలున్నాయి.

# ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

పీటీ వారంట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు.. చంద్రబాబు ప్రధాన కుట్రదారుగా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని వివరించారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరమే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలతో సంతృప్తి చెందిన న్యాయస్థానం చంద్రబాబుపై పీటీ వారంట్‌ను అనుమతిస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. ఆ సమయంలో చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై శుక్రవారం సుప్రీం కోర్టు విచారించనుందని చెప్పారు. అందుకే చంద్రబాబును సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించినట్టు న్యాయాధికారి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలలోపు చంద్రబాబును విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ణయానికి లోబడే తమ తీర్పు ఉంటుందని చెప్పారు.

**ప్రత్యేక పీపీపై దాడికి యత్నించిన టీడీపీ న్యాయవాదులు**

ఫైబర్‌నెట్ కుంభకోణంలో చంద్రబాబుపై పీటీ వారంట్‌కు అనుమతించడంతో చంద్రబాబు న్యాయవాదులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. దాంతో వారు దాఖలు చేసిన కాల్ రికార్డ్స్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదిగా ఉన్న ప్రత్యేక పీపీ వివేకానందపై ఒకదశలో దాడికి తెగబడటం న్యాయస్థానాన్ని విస్మయానికి గురిచేసింది. ఒకానొక దశలో తీవ్ర వాగ్వాదంతో న్యాయస్థానం దద్దరిల్లింది. టీడీపీ న్యాయవాదుల వైఖరితో న్యాయాధికారి నిశ్చేష్టురాలయ్యారు. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విచారిస్తున్న, చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్ రికార్డులను భద్రపరిచేలా ఆదేశించాలని కోరుతూ టీడీపీ న్యాయవాదులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ తరఫున ప్రత్యేక పీపీ వివేకానంద వాదనలు వినిపించారు. సీఐడీ అధికారులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఆ విధి నిర్వహణలో భాగంగానే కేసు దర్యాప్తు చేయడంతోపాటు పూర్తి ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఆయన అరెస్ట్ సక్రమమని గుర్తించే న్యాయస్థానం రిమాండ్ విధించిందని గుర్తుచేశారు. కానీ కేవలం రాజకీయ దురుద్దేశంతో సీఐడీ అధికారుల కాల్ రికార్డులు భద్రపరచాలని టీడీపీ కోరుతోందన్నారు. అలా చేయడం సీఐడీ అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని న్యాయస్థానానికి నివేదించారు. గతంలో కొన్ని న్యాయస్థానాలు ఇచ్చిన ఇటువంటి ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వివేకానంద వాదనలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. పిటిషన్ వేసి ఇప్పటికే నెల రోజులైందని టీడీపీ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. అసలు పిటిషన్‌కే అర్హత లేదని ప్రత్యేక పీపీ వివేకానంద బదులిచ్చారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ న్యాయవాది లక్ష్మీనారాయణ ఒక్కసారిగా ప్రత్యేక పీపీ వివేకానందపైకి దూసుకెళ్లారు. సీఐడీ తరఫున లీగల్ సబ్మిషన్లు చెబుతున్న ఆయనపైకి దూసుకెళ్లి అత్యుత్సాహంతో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసినవారికి బెయిల్ ఇస్తారని ఈ కేసుతో సంబంధంలేని అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఈ కేసులో మీరు ఎందుకు ఇలా చేస్తున్నారని లక్ష్మీనారాయణను న్యాయాధికారి ఆగ్రహంగా ప్రశ్నించారు. లక్ష్మీనారాయణ తీరుపై వివేకానంద కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల న్యాయవాదుల వాగ్వాదంతో న్యాయస్థానం కాసేపు దద్దరిల్లింది. న్యాయస్థానంలో అతిగా ప్రవర్తిస్తున్న వారి పేర్లను నమోదు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నాగరాజు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్‌లో ఉన్నారా అని న్యాయాధికారి ప్రశ్నించారు. వారిద్దరూ ఆ జాబితాలో లేరని చంద్రబాబు న్యాయవాదులు సమాధానం చెప్పారు. అడ్వకేట్స్ ఆన్ రికార్డ్‌లో ఉన్నవాళ్లు తప్ప అందరూ బయటకు వెళ్లాలని ఆదేశించిన జడ్జి.. ఈ విధంగా ఉంటే తాను ఈ కేసు విచారించాలేనని పేర్కొంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ బెంచ్‌దిగి వెళ్లిపోయారు.

# ఆకస్మిక బదిలీలపై ఈసీ ఆరా!

- జిల్లాల వారీగా వివరాలు సేకరిస్తున్న ఈసీ బృందాలు
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా కొన్ని
- ప్రధానంగా డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయిల్లోనే ఇలా

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం మార్గదర్శకాల పేరిట రాష్ట్రంలో చోటు చేసు కున్న ఆకస్మిక బదిలీలపై సీఈసీ ఆరా తీస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా పోలీసు విభాగంలో బుధవారం జరిగిన బదిలీలను నిశితంగా పరిశీలి స్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెల నుంచే కేంద్ర ఎన్ని కల సంఘం చర్యలకు ఉపక్రమించింది. కీలకమైన పోలీసు, రెవెన్యూ విభాగాల్లో బదిలీలపై దృష్టి పెట్టింది. దీనికోసం జూన్ 2న మెమో నెం.437/ 6/1/ ఐఎన్ఎస్‌టీ/ ఈసీఐ/ ఎఫ్‌యూఎన్‌సీటీ/ ఎంసీసీ/2023) జారీ చేసింది. ఇందులో ఆయా బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. క్షేత్రస్థాయి లో విధులు నిర్వర్తించే ఫోకల్ విభాగం అధికారి ఒకే పోస్టులో, ఒకే రెవెన్యూ జిల్లా లో మూడేళ్ళ పాటు పని చేస్తే బదిలీ చేయాలని స్పష్టం చేసింది. అలాగే సొంత రెవెన్యూ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న, గత ఎన్ని కల సమయంలో వివాదా స్పదమైన, కేసులు నమోదైన అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను జూలై 31 నాటికే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

**జిల్లాల వారీగా పరిశీలన**

గత జూలై నుంచి పట్టించుకోకుండా యుద్ధప్రాతిపదికన ఇప్పుడు అర్థాంతరంగా జరిగిన బదిలీలను ఈసీ పరిశీలిస్తోంది. అస్మదీయ అధికారులను కోరిన చోటకు బదిలీ చేయించుకున్నారన్న వాదనలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలు, పైరవీలకే పెద్ద పీట వేశారన్న విమర్శలూ లేకపోలేదు. వీట న్నింటీని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం స్థానిక పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ప్రత్యేక బృందాలతో జిల్లాల వారీగా అధ్యయనం చేయిస్తోంది.

**అక్కడ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు**

ఇక వివిధ జిల్లాల్లో, ఈసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా, స్థానిక నేతలు, సానుకూలత కారణాలతో జరిగిన బదిలీలు వివాదాస్పదంగానూ మారాయి. ప్రధానంగా మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, స్టేషన్ ఘన్‌పూర్, గోషామహల్, ఇబ్రహీంపట్నం, సంగారెడ్డి, కోదాడ, నిర్మల్, గద్వాల్, చేవెళ్ళల్లోని అనేక డీఎస్పీ/ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల ట్రాన్స్‌ఫర్లు ఈసీ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ పని చేసిన అధికారులు, బదిలీలకు కారణాలు, ప్రస్తుతం పని చేస్తున్న వారి నేపథ్యం తదితరాలను ఎన్నికల సంఘం లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. వీటిపై ఓ స్పష్టత వచ్చిన తర్వాత త్వరలోనే అనేక కీలక పోస్టుల్లో మార్పులు చేర్పులు ఉంటాయని అంటున్నారు.

## అంచనాలు సిద్ధం చేసి ఈసీకి పంపండి..

సాక్షి, హైదరాబాద్: రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, నీటి పరిశుభ్రత.. తదితర అంశాలకు సంబంధించి అంచనాలు రూపొందించి ఎన్నికల కమిషన్‌కు పంపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ పనుల పురోగతిపై తదుపరి విచారణ రోజున స్థాయీ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని. 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించగా, రోనాల్డ్ రోస్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిమితుల నిర్ధారణకు సంబంధించి అక్టోబర్ 11 నాటి ప్రిలిమినరీ నోటిఫికేషన్ కాపీని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి సమర్పించారు. 30 రోజుల్లోగా తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా ఈసీ నుంచి అనుమతి తీసుకుని పని ప్రారంభిస్తామని, రెండు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ధర్మాసనం విచారణను డిసెంబర్ 28కి వాయిదా వేసింది.

## బాబు ముఖం చూస్తే స్కామ్‌లు గుర్తొస్తాయి

- ఆయన ఎప్పుడైనా వరుసగా ఒక నెల రోజులు రాష్ట్రంలో ఉన్నాడా?: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- 35 ఏళ్లు కుప్పం ఎమ్మెల్యేగా ఉంటూ పేదవాడికి ఒక్క ఇల్లూ కట్టలేదు
- బాబు దత్తపుత్రుడి ఇల్లు హైదరాబాద్‌లో ఉంటుంది
- ఆ ఇంటిలో ఇల్లాలు మాత్రం ప్రతి 3, 4ఏళ్లకు మారిపోతోంది
- ఒకసారి లోకల్, మరోసారి నేషనల్, తరువాత ఇంటర్నేషనల్.. ఈసారి ఎక్కడికి?..

మరిన్ని వివరాలు, ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

**జిల్లా వార్తలు**

### ఐటీసీ ఆధ్వర్యాన గిరిజన విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

బూర్గంపాడు/భద్రాచలం టౌన్: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఐటీసీ అనుబంధ భద్రాద్రి మహిళా సమితి(బీఎంఎస్) ఆధ్వర్యాన ల్యాప్‌టాప్‌లు అందజేశారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో కట్టం శ్రీవల్లిక, కొర్సా లక్ష్మి చదవగా, శ్రీవల్లిక భువనేశ్వర్‌లోని ఎన్ఐఎస్ఈఆర్ కళాశాలలో ఎమ్మెస్సీ చదువుతోంది. వీరి ఉన్నత చదువులకు ల్యాప్‌టాప్‌లు అవసరం కావడంతో ఐటీసీ యాజమాన్యాన్ని సంప్రదించారు. దీంతో బీఎంఎస్ ఆధ్వర్యాన గురువారం లాప్‌టాప్‌లు అందించగా, ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ చెంగలరావు మాట్లాడారు. చదువులో రాణిస్తున్న ఏజెన్సీ ప్రాంత విద్యార్థినులకు చేయూతనిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఉపాధ్యక్షురాలు సునీత మొహంతి, లక్ష్మీ రాంబాబు, అంజు థమక్, శ్రీదేవి సుబ్రహ్మణ్యం, ప్రతిభాచౌదరి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### రాణాప్రతాప్‌కు 'రైతు నేస్తం' అవార్డు



రాణాప్రతాప్

వైరారూరల్: వైరా మండలంలోని వల్లాపురానికి చెందిన అభ్యుదయ రైతు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ మెంబర్ తుమ్మల రాణాప్రతాప్ రైతు నేస్తం అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయ రంగంలో పద్మశ్రీ డాక్టర్ ఐ.వీ.సుబ్బారావు, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ట్రస్ట్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన రెండు తెలుగు రాష్ట్రాల్లోకి రైతులకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన అవార్డుకు రాణాప్రతాప్‌ను ఎంపిక చేసినట్లు గురువారం సమాచారం ఇచ్చారు. ఆయన ఈనెల 14న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గన్నవరం స్వర్ణభారతి ట్రస్ట్ భవన్‌లో అవార్డును అందుకుంటారు.

# ఆ రైతులకూ రుణమాఫీ!

- బయ్యారం, బీరోలు, కల్లూరుగూడెం సొసైటీల్లో రైతులకు లబ్ధి
- 1,843 మంది రైతులకు రూ.4.37 కోట్ల రుణమాఫీ పూర్తి
- ముదిగొండ సొసైటీలో 585 మందికి రూ.2.12 కోట్లు



డీసీసీబీ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: రైతులు తీసుకున్న పంటలను రుణాలను మాఫీ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా... ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని మూడు పీఏసీఎస్‌ల పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. దీంతో రైతుల ఆవేదనను ఆగస్టు 18వ తేదీన 'మూడు సొసైటీలు గల్లంతు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు జాబితాను మరోమారు ఉన్నతాధికారులకు జాబితా పంపించగా రైతుల ఖాతాల్లో నగదు జమ కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**వంద సంఘాల్లో మూడు గల్లంతు**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల పరిధిలో మొత్తం వంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో ఖమ్మం డీసీసీబీ కొనసాగుతోంది. వీటి పరిధిలో 1,62,906 మంది రైతులకు సంబంధించి రూ.6,16,97,09,646 రుణమాఫీ కావాల్సి ఉంది. ఈమేరకు డీసీసీబీ నుంచి రాష్ట్ర సహకార బ్యాంకుకు జాబతా పంపించగా మహబూబాబాద్ జిల్లా బయ్యారం, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు, కూసుమంచి మండలం కల్లూరుగూడెం సహకార సంఘాలు గల్లంతయ్యాయి. బయ్యారం సొసైటీ పరిధిలో 1,763 మంది రైతులకు రూ. 5.04 కోట్లు, బీరోలు సొసైటీలో1,440 మంది రైతులకు రూ.6.07 కోట్లు, కల్లూరుగూడెం సొసైటీలో 1,524 మంది రైతులకు రూ. 6 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది.

**'సాక్షి' కథనంతో కదలిక**

మూడు పీఏసీఎస్‌ల పరిధిలోని రైతుల పేర్లు జాబితాలో లేని విషయమై 'సాక్షి' బయటపెట్టడంతో ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీఈఓ అట్లూరి వీరబాబు రాష్ట్ర సహకార బ్యాంకును సంప్రదించగా, కలెక్టర్ గౌతమ్ కూడా వివరాలు ఆరా తీశారు. మరోవైపు బయ్యారం పీఏసీఎస్ అధ్యక్షుడు మూల మధూకర్‌రెడ్డి రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్‌కు 'సాక్షి' కథనాన్ని చూపించి సమస్యను వివరించారు. ఆమె రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈనేపథ్యాన 9వ తేదీన బయ్యారం, బీరోలు, కల్లూరుగూడెం సహకార సంఘాలతో పాటు జిల్లాలోని ముదిగొండ సహకార సంఘంలో కూడా గల్లంతైన రైతులకు రుణమాఫీ నిధులు మంజూరు చేశారు.

**సాక్షి ఎఫెక్ట్..**

**మూడింటితో పాటు ముదిగొండలో...**

రుణమాఫీలో గల్లంతైన బయ్యారం, బీరోలు, కల్లూరుగూడెం పీఏసీలను పేర్లను జాబితాలో చేర్చి 1,843 మంది రైతులకు సంబంధించిన రూ.4.37 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. బయ్యారం సొసైటీ పరిధిలో 593 మందికి రూ.1.60 కోట్లు, బీరోలు సొసైటీలో 575 మందికి రూ.1.45 కోట్లు, కల్లూరుగూడెం సొసైటీలో 675 మందికి రూ.1.32 కోట్లను ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, ఆయా సొసైటీల పరిధిలో ఇంకొందరు రైతులు ఉండగా, మరో దఫాలో మాఫీ అవుతుందని చెబుతున్నారు. కాగా, రుణమాఫీ వ్యవహారంలో ముదిగొండ సొసైటీ కూడా ఉండగా 585మంది రైతులకు రూ. 2.12 కోట్లను జమ చేశారు.

**రైతుల్లో ఆనందం**

ఎట్టకేలకు ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పొరుగు సొసైటీలకు చెందిన రైతుల రుణాలు మాఫీ కావడం.. తమ పేర్లు లేకపోవడంతో నెలలుగా వారు ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఖాతాల్లో నగదు జమ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఖమ్మం డీసీసీబీ పరిధిలో మొత్తం రూ.616 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.232 కోట్ల రుణాలు మాఫీ అయినట్లు సమాచారం.

# నేటి నుంచి స్పోర్ట్స్ మీట్

14 గురుకులాల నుంచి హాజరుకానున్న 1,200 మంది విద్యార్థులు



పోటీల కోసం సిద్ధం చేసిన రన్నింగ్ ట్రాక్

ములకలపల్లి: ములకలపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో నేటి నుంచి మూడు రోజులపాటు 9వ లెవల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 14 గురుకులాలు ఉండగా, ఒక్కో గురుకులం నుంచి 80 మందికి తగ్గకుండా, మొత్తం 1,200 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే కళాశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దగా, శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పోటీలను ప్రారంభించనున్నారు. ఆర్‌సీఓ కె.ప్రత్యూష, డీఓఏ వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అండర్-14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో, టెన్నిస్, క్యారమ్స్, అథ్లెటిక్స్‌లో 100మీ, 200 మీ, 400 మీ, 800 మీ, 1,500 మీ, 3,000 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు భోజన, బస ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం మధ్యాహ్నం బతుకమ్మ వేడుకలతోపాటు క్యాంప్‌ఫైర్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ఏర్పాట్లు పూర్తి**



మూడురోజులపాటు నిర్వహించే ఈ క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గురుకులాల పీడీలు, పీఈటీలు పోటీలు నిర్వహిస్తారు. పోటీలు విజయవంతంగా చేసేందుకు కృషి చేస్తున్నాం.

-సునీత, ప్రిన్సిపాల్, టీఎస్‌డబ్ల్యూఆర్

## రామయ్యను దర్శించుకున్న సిద్దేశ్వరానంద భారతీస్వామి



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాస వద్ద ఉన్న తోపవన, కుర్తాళ పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ స్వామిజీ గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి రామానుజాచార్యులు ఆయనకు పరివట్టం కట్టి స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న స్వామీజీకి ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. స్థానాచార్యులు స్థలశాయి, ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ ప్రగతి

కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ




మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ, పక్కన నాయకులు

ఇల్లెందు: కేంద్రంలో మాదిరి తెలంగాణలో కూడా బీజేపీ సర్కార్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. ఇల్లెందులో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలనను అంతమొందించి డబుల్ ఇంజన్ సర్కార్ చేయడం ఖాయమని తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. దేశంలో 60 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని ఎన్నో పనులను మోదీ నేతృత్వాన తమ ప్రభుత్వం చేసిందని చెప్పారు. కాగా, కేంద్రం పేదలకు ఉపయోగపడేలా గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశపెడితే రాష్ట్రప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందన్నారు. తెలంగాణలో కుటుంబ, అవినీతి పాలన సాగుతుండడంతో కేంద్రప్రభుత్వ పథకాలు ఇక్కడి ప్రజలకు అందటం లేదని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, నాయకులు నాళ్ల సోమసుందర్, ఉమాదేవి, లక్కినేని సురేందర్, కుమారస్వామి, వెంకటరామిరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, బలగాని గోపీకృష్ణ, భట్టు రమేష్, జి.రాంచందర్ నాయక్, హతీరాం నాయక్, పూన్యానాయక్, రజత్ కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత కేంద్ర మంత్రి సువర్చలాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

## బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లే...

బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి సునీల్ దియోదర్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ దియోదర్

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లేనని బీజేపీ ఖమ్మం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి సునీల్ దియోదర్ అన్నారు. ఖమ్మంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు కూడా హిందూ వ్యతిరేక పార్టీలేనని ఆరోపించారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై తాము అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తామని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి మోదీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లాలో షెడ్యూల్ తెగల వారు బీఆర్‌ఎస్‌పై కోపంగా ఉన్న నేపథ్యాన వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, దొంగల సత్యనారాయణ, ఉప్పల శారద, గెంటెల విద్యాసాగర్, పసుమర్తి సతీష్, డాక్టర్ శీలం పాపారావు, రుద్ర ప్రదీప్, శ్యాం రాథోడ్, నంబూరి రామలింగేశ్వరావు, రవిరాథోడ్, లక్ష్మీనారాయణగుప్తా, భద్రం, శ్రీనివాస్, దొడ్డా అరుణ, శ్రీదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## అనైక్యతతోనే ఉద్యోగులకు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ సంఘాల్లో అనైక్యత కారణంగానే ఉద్యోగులకు నష్టం జరుగుతోందని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల్లో ఉన్న అనైక్యత వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించిన సందర్భంగా ఐఆర్ కనీసం 15శాతమైనా ఇవ్వకుండా ఉద్యోగులను మోసం చేసిందని చెప్పారు. గత పీఆర్సీ ఏరియర్స్ చెల్లించకపోగా, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ డీఈఓ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పక్షపాతం అవలంబిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు ముత్తయ్య, ప్రసాదరావు, వెంకటేశ్వరావు, వీరబాబు, నాగేశ్వరరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.